ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :188 ఆదివారం మే 3 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## మృత్యు ఒడిలోనూ వీడని మాతృత్వం

- బార్గి డ్యామ్‌లో విషాదం
- మరణించినా బిడ్డను వీడని తల్లి ప్రేమానుబంధం!
- తల్లీకొడుకుల మరణం, కంటతడి పెట్టించిన దృశ్యం
- పర్యాటక భద్రతా లోపాలు, తొమ్మిది మంది బలి
- విచారణకు ఆదేశించిన పర్యాటక శాఖ





జబల్‌పూర్, మే 2 (మనప్రజాప్రతినిధి): మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లాలోని బార్గి డ్యామ్‌లో జరిగిన ఘోర పడవ ప్రమాదం యావత్ దేశాన్ని కలచివేసింది. ఏప్రిల్ 30, గురువారం సాయంత్రం సుమారు 5:00 గంటలకు నర్మదా నదిపై పర్యాటక బోటు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా బలమైన తుపాను రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఢిల్లీకి చెందిన మెరీనా మస్సే (39), ఆమె నాలుగేళ్ల కుమారుడు త్రిషాన్ ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం రెస్క్యూ టీమ్ మృతదేహాలను వెలికితీసే సమయంలో కనిపించిన దృశ్యం అందరినీ కన్నీరు పెట్టించింది. మరణించినా కూడా ఆ తల్లి తన కుమారుడిని గుండెలకు గట్టిగా హత్తుకుని ఉండటం ఆమె మాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. ఢిల్లీ నుండి ఒక గృహప్రవేశం వేడుక కోసం జబల్‌పూర్ వచ్చిన ఈ కుటుంబంలో తండ్రి ప్రదీప్ కుమార్, కుమార్తె సియా ప్రాణాలతో బయటపడగా, తల్లి కుమారుడు మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయం లో బోటులో సుమారు 40 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గాలివాన తీవ్రతకు బోటు నియంత్రణ కోల్పోయి నిమిషాల వ్యవధిలోనే నీటిలో మునిగి పోయింది. సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ టీమ్ ఇప్పటివరకు సుమారు 28 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది పర్యాటకులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. పర్యాటక శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గురైన బోటులో తగినన్ని లైఫ్ జాకెట్లు అందుబాటులో లేవని ప్రాథమిక విచారణలో తేలింది. వాతావరణం అనుకూలించకపోయినా, తుపాను హెచ్చరికలు ఉన్నా ప్రయాణానికి అనుమతించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పర్యాటక శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దుర్ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ₹2 లక్షలు, గాయపడిన వారికి ₹50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పర్యాటక ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఇలాంటి ప్రాణనష్టం తప్పదని ఈ ఘటన మరోసారి హెచ్చరించింది. అధికారులు ప్రస్తుతం నదిలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి ప్రాణం తృణప్రాయంగా మారుతోంది. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు కూడా తమ భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా బోటు ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు ధరించడం తప్పనిసరి చేయాలి. బాధ్యతాయుతమైన పర్యాటక రంగం ఉన్నప్పుడే ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. మరణించినా బిడ్డను వీడని ఆ తల్లి ప్రేమ అందరినీ కలచివేస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండటమే ఆ తల్లికి మనం ఇచ్చే అసలైన నివాళి. సామాన్య పౌరుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

## జెన్ జీ లక్ష్యంగా టీఆర్ఎస్ కార్యాచరణ



-'మీట్ ది ప్రెస్'లో కవిత విస్తృత ప్రకటనలు
-లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యోగాల హామీతో ఉద్యమకారులకు భరోసా
-ప్రభుత్వ వైఫల్యాలపై ఘాటైన విమర్శలు
-క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపు

హైదరాబాద్, మే 02 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాజకీయాల్లో కొత్త దిశను సూచించేలా టీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటనలు చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ జాగృతి సంస్థను ఇకపై ఎన్జీవోగా మార్చుతూ సామాజిక కార్యక్రమాలపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ రక్షణ సేనను జెన్ జీ యువతను లక్ష్యంగా తీసుకుని విస్తరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గౌరవించేందుకు లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యోగాలను సృష్టిస్తామని కవిత ప్రకటించారు. ఉద్యమానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. 'పాంచజన్యం' పేరుతో ప్రజల్లోకి వెళ్లి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సర్వోదయ తెలంగాణే తమ అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కవిత వెల్లడించారు. ఎంతటి పెద్ద అనారోగ్యం వచ్చినా పేదలకు పూర్తిగా ఉచిత వైద్యం అందించడమే తమ విధానమని తెలిపారు. విద్య కూడా అందరికీ అందుబాటులో ఉండేలా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలను తగ్గించే దిశగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వివరించారు. రైతుల సమస్యలపై కూడా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ధాన్యం అమ్మకాల్లో సమస్యలు తలెత్తకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా విధానాలు అమలు చేస్తామని

2

## పరేడ్ గ్రౌండ్స్ సభకు బీజేపీ భారీ సన్నాహాలు

- ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు దిశానిర్దేశం
- మే 10న మోదీ సభ విజయవంతానికి విస్తృత కార్యాచరణ
- లక్ష మందితో సభను విజయవంతం చేయాలని పిలుపు



మేడ్చల్, మే 02 (మనప్రజాప్రతినిధి): మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రధాని సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ శ్రేణులు వేగంగా సన్నాహాలు ప్రారంభించాయి. ఈ క్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లాలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని కీలక సూచనలు చేశారు. కొంపల్లిలోని హైందవ నిమంత్రణ కన్వెన్షన్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్తో కలిసి ఈటల రాజేందర్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సభ నిర్వహణ, ప్రజల సమీకరణ, ప్రచార వ్యూహాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మెజారిటీ రావడం పార్టీ బలాన్ని చూపించిందని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. అదే ఉత్సాహంతో మళ్లీ మోదీ సభకు భారీగా ప్రజలను సమీకరించాలని సూచించారు. ప్రజలు మోదీ నాయకత్వాన్ని విశ్వసించి మళ్లీ ఆయనను ప్రధాని చేయాలనే సంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు.



దేశవ్యాప్తంగా బీజేపీ బలపడుతోందని, గుజరాత్‌లో దీర్ఘకాలంగా పార్టీ విజయాలు సాధిస్తోందని ఉదాహరణగా చెప్పారు. ఒకప్పుడు తక్కువ స్థాయి నుంచి ప్రారంభమైన పార్టీ ఇప్పుడు దేశవ్యాప్తంగా బలమైన శక్తిగా ఎదిగిందని వివరించారు. తెలంగాణలో కూడా అదే పరిస్థితి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ మరింత బలపడాల్సిన అవసరం ఉందని, ఆ లక్ష్యంతోనే మోదీ సభ నిర్వహిస్తున్నామని ఈటల రాజేందర్ తెలిపారు. మల్కాజిగిరి నుంచే మోదీ గత ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే స్థాయిలో ఈసారి కూడా స్పందన చూపించాలని కోరారు. పరేడ్ గ్రౌండ్స్ సభకు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధి నుంచి లక్ష మందిని సమీకరించనున్నట్లు తాను హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆహ్వానించి సభను ఘనవిజయంగా నిలపాలని సూచించారు. సభ ద్వారా తెలంగాణలో పార్టీకి మరింత ఉత్సాహం, భరోసా కలగాలని ఆకాంక్షించారు.మోదీ రోజుకు 365 రోజులు ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడని ఆయన కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలంగా ఉంటే డబ్బుతో పని లేదని, కట్టుదిట్టమైన వ్యవస్థతో ముందుకు సాగితే విజయం సాధ్యమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సమిష్టిగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## బీఆర్ఎస్ బలోపేతంపై కేటీఆర్ దిశానిర్దేశం

- సభ్యత్వ నమోదు, కమిటీల నిర్మాణంపై చర్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలని సూచన
- రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్న పిలుపు



హైదరాబాద్, మే 02 (మనప్రజాప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక అంశాలు చర్చించారు. జిల్లాలో పార్టీని మరింత బలపర్చేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. కొత్త సభ్యులను చేర్చుకోవడంతో పాటు, కమిటీల నిర్మాణాన్ని సమర్థంగా పూర్తి చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించారు. ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి విజయాలు సాధించిన పార్టీ నేతలను కేటీఆర్ అభినందించారు. ఈ విజయాలను మరింతగా విస్తరించేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. ప్రభుత్వ పనితీరును విశ్లేషించి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధమవ్వాలని కేటీఆర్ స్పష్టం చేశారు. సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులకు సూచించారు.





## జెన్ జీ లక్ష్యంగా టీఆర్ఎస్ కార్యాచరణ

మెదటి పేజీ తరువాయి

తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన కవిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల అంశాలను



ఎందుకు విస్మరిస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్‌లో దివ్యాంగులకు సరైన సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని ఆమె మండిపడ్డారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పరిపాలనలో పారదర్శకత లోపించిందని కూడా పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలపై కూడా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. సాధారణ పరిస్థితుల్లో సుమారు వెయ్యి రోజుల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఈ కాలంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య తిరిగి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. "కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతాం" అంటూ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వచ్చి తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమిష్టిగా పనిచేస్తే విజయం సాధ్యమని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## గ్యాస్ ధరల పెంపుపై షర్మిల తీవ్ర విమర్శలు

-ఎన్నికల తర్వాత 'బండ బాదుడు' అంటూ మండిపాటు

-చిన్న వ్యాపారులు, విద్యార్థులపై భారమని ఆందోళన

-ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్



అమరావతి, మే 02 (మనప్రజాప్రతినిధి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీపై నేరుగా దాడి చేస్తూ, ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి తర్వాత ప్రజలపై భారాలు మోపడం అలవాటుగా మారిందని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తైన వెంటనే ధరల పెంపు నిర్ణయం తీసుకోవడం ప్రజలకు ఇచ్చిన 'గిఫ్ట్' అని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి భారీగా పెంపు చేయడం, 5 కిలోల సిలిండర్ ధరను కూడా పెంచడం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. గత ఆరు నెలల్లోనే ధరలు గణనీయంగా పెరిగాయని, ఈ ఏడాదిలోనే దాదాపు 80 శాతం పెరుగుదల నమోదైందని షర్మిల ఆరోపించారు. ఈ తరహా పెంపు దేశ చరిత్రలో అరుదైనదని పేర్కొంటూ, దీనిపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ ధరల పెంపు సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చిన్న హోటళ్లు నడిపే వ్యాపారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని చెప్పారు. బయట ఆహారం తీసుకునే విద్యార్థులు, వలస కార్మికులపై ఇది అదనపు భారంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు పొందిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని చెప్పి ప్రజలపై భారం మోపడం సమంజసం కాదని ఆమె ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాలకన్నా ఆదాయంపై దృష్టి పెట్టడం తప్పని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రజలపై భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేశారు.

## సిద్దిపేటలో హనుమాన్ సిద్ది మహా యాగం

-మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని ఆధ్యాత్మిక సందేశం

-దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం

-భక్తి, ధైర్యానికి హనుమంతుడు ప్రేరణ అని హరీశ్ రావు



3

# అద్దె ఇళ్ల మంట....

●సామాన్యుడికి అందని 'సొంత గూడు' కల!

●ఆకాశాన్నంటుతున్న రియల్ ఎస్టేట్ ధరలు

●మధ్యతరగతిపై భారంగా మారిన అద్దెలు

●నియంత్రణ లేని డిపాజిట్లు, షరతులు





మే 02 (మనప్రజాప్రతినిధి): నగరాల్లో నివసించే మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలకు అద్దె ఇళ్ల సమస్య ఒక పీడకలగా మారుతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో భూముల ధరలు, నిర్మాణ సామాగ్రి ఖర్చులు విపరీతంగా పెరగడం నేరుగా అద్దె ఇళ్లపై ప్రభావం చూపుతోంది. గతంలో అందుబాటులో ఉన్న అద్దెలు ఇప్పుడు రెట్టింపు కావడంతో సామాన్యులు తమ ఆదాయంలో సగానికి పైగా కేవలం ఇంటి అద్దెకే కేటాయించాల్సి వస్తోంది. సొంత గూడు నిర్మించుకోవడం తలకు మించిన భారంగా మారిన తరుణంలో, కనీసం అద్దె ఇంట్లోనైనా ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహాల లభ్యత లేకపోవడం డిమాండ్‌ను పెంచుతోంది. నగరాల్లోని ప్రధాన ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతుంటే, సామాన్యులు శివారు ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. అయితే అక్కడ కూడా రవాణా ఖర్చులు, సమయం వృధా కావడం మరో సమస్యగా మారుతోంది. రియల్ ఎస్టేట్ ధరల పెరుగుదలను ఆసరాగా చేసుకుని ఇంటి యజమానులు ఏటా అడ్డగోలుగా అద్దెలు పెంచుతున్నారు. అద్దె నియంత్రణ చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం వల్ల అద్దెదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం అద్దె మాత్రమే కాకుండా అడ్వాన్స్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడం మరో ప్రధాన సమస్య. కొన్ని చోట్ల పది నెలల అద్దెను డిపాజిట్‌గా అడగడం పేద, మధ్యతరగతి వారికి పెను భారంగా మారుతోంది. దీనికి తోడు మెయింటెనెన్స్ ఖర్చులు, కరెంట్ బిల్లుల భారం అదనం. ఇంటి అద్దెకు దిగేటప్పుడు యజమానులు పెడుతున్న వింత షరతులు అద్దెదారుల స్వేచ్ఛను హరిస్తున్నాయి. బ్యాచిలర్లకు ఇళ్లు ఇవ్వకపోవడం, కొన్ని రకాల ఆహార నియమాలు పాటించాలని ఒత్తిడి చేయడం వంటివి సామాజిక వివక్షకు దారితీస్తున్నాయి....ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అద్దెల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్న ప్రతిచోటా కృత్రిమంగా ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఆ ప్రాంతాల్లో నివసించే అవకాశాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణ రంగంలో జోక్యం చేసుకుని అద్దెదారుల రక్షణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో భవిష్యత్తులో గూడు లేని జనాభా పెరిగిపోయే ప్రమాదం ఉంది. తక్కువ ధరలో అద్దె ఇళ్ల లభ్యతను పెంచడంపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు కేవలం భూములకే పరిమితం కాకుండా సామాన్యుడి జీవనశైలిని దెబ్బతీస్తున్నాయి. అద్దె ఇళ్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థల ద్వారా పర్యవేక్షణ పెంచాలి. అద్దె ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలి. సామాన్యుడికి గూడు కల్పించడం అనేది వ్యాపారం కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించాలి. అప్పుడే మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోగలవు. అద్దె భారం తగ్గితేనే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

## మీడియా అవార్డ్ వేదికపై... జర్నలిజం ప్రాముఖ్యతకు గుర్తింపు

❑మంత్రి శ్రీధర్ బాబు పాల్గొనడం విశేషం

❑వివిధ రంగాల జర్నలిస్టులకు ఒకే వేదికపై సత్కారం

❑వేగవంతమైన కాలంలో విశ్వసనీయ జర్నలిజం అవసరం

❑అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపిన మంత్రి



3

## పూణేలో చిన్నారిపై దారుణం... నిందితుడు అరెస్ట్



-నాలుగేళ్ల బాలికపై అత్యాచారం, హత్య ఘటన

-సీసీ దృశ్యాలతో బయటపడిన నేరం

-ఆందోళనలకు దిగిన స్థానికులు, కఠిన చర్యల డిమాండ్

పూణే, మే 02 (మనప్రజాప్రతినిధి): మహారాష్ట్రలోని పూణే పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై ఓ వృద్ధుడు అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం భోర్ తహసీల్ పరిధిలోని గ్రామంలో ఈ ఘటన జరిగింది. చిన్నారిని ఆహారం ఇస్తానని చెప్పి ఓ వృద్ధుడు తనతో తీసుకెళ్లాడు. అనంతరం సమీపంలోని పశువుల పాకలోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు

3

## మీడియా అవార్డ్స్ వేదికపై జర్నలిజం ప్రాముఖ్యతకు గుర్తింపు



తరువాయి భాగం

హైదరాబాద్, మే 02 (మనప్రజాప్రతినిధి): హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ 2026 కార్యక్రమంలో తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు దుద్దిల్లా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మీడియా రంగానికి చెందిన ప్రతిభావంతుల్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ప్రింట్, టెలివిజన్, రేడియో, డిజిటల్ వేదికలలో సేవలందిస్తున్న జర్నలిస్టులను ఒకే వేదికపై గుర్తించడం అభినందనీయం అని మంత్రి పేర్కొన్నారు. ఈ అవార్డ్స్ ద్వారా మీడియా రంగంలో కృషి చేస్తున్న వారికి గౌరవం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో సమాచార ప్రసారం వేగంగా జరుగుతున్న నేపథ్యంలో, విశ్వసనీయమైన జర్నలిజం పాత్ర మరింత ముఖ్యమైందని మంత్రి అన్నారు. నిజాయితీతో కూడిన వార్తలు సమాజానికి అవసరమని స్పష్టం చేశారు. ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హైబిజ్ టీవీని మంత్రి అభినందించారు. మీడియా రంగాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రయత్నం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. వారి కృషి ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మీడియా రంగం సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తులో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

## పూణేలో చిన్నారిపై దారుణం.. నిందితుడు అరెస్ట్



తరువాయి భాగం

చేయగా దర్యాప్తు ప్రారంభమైంది. సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాల్లో నిందితుడు చిన్నారిని తీసుకెళ్తున్నట్లు రికార్డు కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసును మరింతగా విచారిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళనకు దిగారు. బెంగళూరుముంబై జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ రాకపోకలను అడ్డుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, త్వరగా ఛార్జిషీట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది. ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు కూడా తీవ్రంగా స్పందించగా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## సిద్దిపేటలో హనుమాన్ సిద్ది మహా యాగం

తరువాయి భాగం





సిద్దిపేట, మే 02 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన భవిష్యత్ బ్రహ్మ హనుమాన్ సిద్ది మహా యాగం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేటలో ఆంజనేయ స్వామి మాలకు అంకురార్పణ జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో ఇలాంటి మహా యాగం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. సిద్దిపేటలో ఈ యాగం జరగడం ప్రాంతానికి గౌరవంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ యాగంలో సుందరకాండ యజ్ఞం, 72 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష సార్లు పారాయణం వంటి విశిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. హనుమాన్ భక్తుల రూపంలో హనుమంతుడిని విశ్వవ్యాప్తం చేయాలన్న స్వామీజీ లక్ష్యం అభినందనీయం అని కొనియా డారు. సిద్దిపేటలో ప్రతి సంవత్సరం హనుమాన్ మాలలు వేల సంఖ్యలో ధరించబడుతున్నాయని, దేశంలోనే అత్యధికంగా హనుమాన్ మాలలు ధరించే భక్తులు ఇక్కడ ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ విజయానికి దుర్గాప్రసాద్ స్వామీజీ ఆశీస్సులు కారణమని అన్నారు. స్వామీజీ భక్తులకు సౌలభ్యం కల్పించేందుకు స్వయంగా సిద్దిపేటకు వచ్చి మాల ధారణ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. భక్తుల మాల విరమణను కూడా ఆయన చేతుల మీదుగా నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తుందని వివరించారు. సిద్దిపేట మట్టికి ప్రత్యేకమైన మహత్యం ఉందని, ఇక్కడ ప్రారంభమైన కార్యక్రమాలు విజయవంతమవుతాయని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కూడా ఈ నేల నుంచి ప్రారంభమైందని గుర్తుచేశారు. దేశంలోని ప్రముఖ ఆలయాల్లో సిద్దిపేట భక్తులు సేవలందిస్తున్నారని, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సేవలో ముందంజలో ఉన్నారని అన్నారు. భక్తితో హనుమంతుడిని స్మరిస్తే మనోధైర్యం పెరుగుతుందని, కష్టాలు దూరమవుతాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత విస్తరించాలని, సమాజానికి శాంతి, ధైర్యం అందించాలని హరీశ్ రావు ఆకాంక్షించారు.

## ఇరాన్ ఒప్పందంపై ట్రంప్ అసంతృప్తి

### -చర్చలకు సిద్ధమని ఇరాన్ సంకేతాలు
### -సైనిక చర్యలపై అమెరికా నిర్ణయాలు



వాషింగ్టన్, మే 02 (మనప్రజాప్రతినిధి): డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం అంశంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ చేసిన ప్రతిపాదనలు సంతృప్తికరంగా లేవని ఆయన స్పష్టం చేశారు. అయితే మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ చర్చలకు సిద్ధమని సంకేతాలు ఇవ్వడం గమనార్హం. దీంతో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయి. గత రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితిపై ఇంకా ప్రతిష్టంభన నెలకొంది. ఇరాన్‌అమెరికా సంబంధాలపై అంతర్జాతీయ వేదికలలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అమెరికా మిత్రదేశాలు ఈ అంశంపై భిన్న అభిప్రాయాలను వెల్లడించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చుతోంది. ఇదే సమయంలో అమెరికా కొన్ని కీలక చర్యలకు దిగింది. జర్మనీలో ఉన్న సుమారు ఐదు వేల మంది సైనికులను ఉపసంహరించుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఇది యూరప్ భద్రతా వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా భావిస్తున్నారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ వైఖరిని ట్రంప్ ఇటీవల విమర్శించారు. హోర్ముజ్ జలసంధిలో నౌకల దిగ్బంధనం పైరసీ తరహాలో కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ఇరాన్ చర్యలు అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇరాన్‌తో ఒప్పందం చేసుకోవాలనే ఆసక్తి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనలు అంగీకారయోగ్యం కావని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ నేతలు అంతర్గతంగా విభజనలో ఉన్నారని, తాము అంగీకరించలేని షరతులు కోరుతున్నారని అన్నారు. అయినప్పటికీ ఫోన్ ద్వారా సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరాన్ అణు ఆయుధాన్ని సమీకరించకుండా అడ్డుకుంటామని అమెరికా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో చర్చలు ఎటువంటి మలుపు తిరుగుతాయో అనేది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది

## సివిల్ జడ్జికి సాదర స్వాగతం





మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల:జనగామ నియోజకవర్గం. చేర్యాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు నూతనంగా విచ్చేసిన న్యాయమూర్తి శ్రీరామ్ కి సాదర స్వాగతం పలికిన చేర్యాల బార్ అసోషియోషన్ సభ్యులు. ఈ సందర్భంగా చేర్యాల బార్ అసోషియోషన్ అధ్యక్షులు ఆరెల్ల వీరమల్లయ్య, మాట్లాడుతూ చేర్యాల కోర్టుకు నూతనంగా విచ్చేసిన నూతన న్యాయమూర్తి శ్రీరామ్ కి సాదర స్వాగతం పలుకుతూ చేర్యాల ప్రాంత కక్షిదారులకు సత్వర న్యాయం చేకూరే విధంగా నూతన న్యాయమూర్తి కృషి చెయ్యాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బార్ అసోషియోషన్ ప్రధాన కార్యదర్శి మేరుగు రమేష్,సహాయ కార్యదర్శి పొన్నం సురేష్,కోశాధికారి గుస్క వెంకటేశం,సీనియర్ న్యాయవాదులు భూమి గారి మనోహర్,బూర్గు యాదగిరి గౌడ్,ఆరెల్ల మహేందర్,తాటి కొండ ప్రణిత్,గూడెం శ్రీధర్, పర్వతం రాములు,అంకని సురేందర్,దర్శణం ప్రశాంత్,రిక్కల రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను ప్రారంభించిన రాజన్న సిరిసిల్ల జిల్లా సిఐ నాగేశ్వరరావు



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 02 మే :ఇల్లంతకుంట మండలంలోని ఎర్నాస్ పల్లి లో పెద్దమ్మ దేవాలయంలో రహీం ఖాన్పేట ఉప సర్పంచ్ గడ్డమీది పద్మ మూడు సీసీ కెమెరాలు సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు.సీసీ కెమెరాలు ప్రారంభించిన రాజన్న సిరిసిల్ల జిల్లా సిఐ నాగేశ్వరరావు వారితోపాటు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరికీ సీసీ కెమెరాల వల్ల ఉపయోగం గురించి ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని తెలియజేశారు.సీసీ కెమెరాల వలన గ్రామంలోని అపరిచిత వ్యక్తులను త్వరితంగా పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు మునుముందు చేయాలని కోరుకుంటున్నాను.మా పోలీస్ శాఖ తరపున రహీంఖాన్పేట్ ఉపసర్పంచ్ గడ్డమీద పద్మకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాము. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాగుల మహేందర్,వార్డు మెంబర్లు పెద్ది మారుతి,రాగుల నరేష్, కూస రవి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కమటం రాములు, బత్తిని మల్లయ్య, గడ్డమీది శ్రీనివాస్,కంకటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## చుంచనకోట గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి ఆవు మృతి







మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలం, చుంచనకోట గ్రామంలో శనివారం రోజున,చెట్కూరి భీమరాజు సన్నాఫ్ మల్లయ్య అనే రైతు యొక్క పొలంలో మేతమేస్తున్నటువంటి ఆవు పైన ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగి పడడంతో ఆవు మృతి చెందడం జరిగింది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలను సరి చేయడం జరిగింది. పాలు ఇచ్చే ఆవు మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.రేక్కా డితే కానీ పూట గడవని పరిస్థితిలో ఉన్న మా కుటుంబాన్ని ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించగలరని కోరారు.ఇట్టి ప్రమాద స్థలాన్ని,సర్పంచి,ఉప సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,కారోబార్, పరిశీలించడం జరిగింది.

# సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలి



-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు


మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట:నార్సింగి పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా సమగ్ర భద్రత కల్పించాలని పేర్కొన్నారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, తెలియని కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, స్థానికుల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎస్పీ తెలిపారు.అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ సృజన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దొమ్మాటలో పోచమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



(మన ప్రజాప్రతినిధి మే 02):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని దొమ్మాట గ్రామంలో శ్రీ శ్రీ పోచమ్మ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ దేవి గారి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో పాలకవర్గ సభ్యులు, పోచమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి.భక్తులు పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, గ్రామ శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించగా, గ్రామస్థులు ఆనందంగా పాల్గొన్నారు.

# దొమ్మాటలో పోచమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ మాధవనేని రఘునందన్ రావు




(మన ప్రజాప్రతినిధి మే 02):సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని దొమ్మాట గ్రామంలో శ్రీ శ్రీ పోచమ్మ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ దేవి గారి అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో పాలకవర్గ సభ్యులు, పోచమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి.భక్తులు పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, గ్రామ శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించగా, గ్రామస్థులు ఆనందంగా పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించిన విద్యుత్ శాఖ అధికారులు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా ,చేగుంట మే 2: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని నార్సింగి మండల విద్యుత్ శాఖ విభాగ కార్యాలయంలో అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయ విభాగ అధికారి ఆదెయ్య, విభాగ ఇంజనీర్ స్వామి అధ్యక్షత వహించగా, లైన్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు, గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగం లో పాటించాల్సిన భద్రతా నియమాలు, అప్రమత్తత చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఉపయోగించడం, పొలాలలో విద్యుత్ సంబంధిత పనులు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే స్పందించే విధానాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవ గాహన పెంపొందించడం లక్ష్యమని అధికారులు తెలిపారు.

# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ నియోజక వర్గంలోని కీసర మండలంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ,మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి , కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ గారితో కలిసి లబ్ధిదారులకు అందజేసిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధికార ప్రతినిధి, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకొని అమలు చేస్తున్న పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు.ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని,అలాగే అత్యవసర పరిస్థితుల్లో సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ప్రజలకు ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్ కుమార్, నాయకులు రాజు యాదవ్, సాయి కృష్ణ, మధు తో పాటు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

